శృంగారవీక్షి

# యూజ్ అండ్ త్రో

ముప్పా శ్రీనివాస్

**"నేను చరిష్మాతో రాత్రంతా గడిపాను తెలుసా?" అన్నప్పుడు మా ఫ్రెండ్సంతా ముక్కు మీద వేలేసుకున్నారు.**

"ఆహా! అదృష్టమంటే నీదేనోయ్! పరిచయం ప్రేమగామారి నెలైనా కాకుండానే ఆమెను లొంగదీసుకున్నావంటే నీవు సామాన్యుడివి కావు, ఘటికుడివే! ఇంతకీ ఆమె బాగా కోపరేట్ చేసిందా?'' లాంటి ప్రశ్నలతో నన్ను చుట్టేశారు.

అందరికీ నేను ఎప్పటికప్పుడు చెప్తూనే వుంటాను చరిష్మాతో నా ప్రేమాయణం గురించి.

ఆ ఇంట్లోకి నేను అద్దెకు దిగి దాదాపు నెలకన్నా ఎక్కువే అయింది. మేడమీద నాలానే ఒంటరిగది. మేడమీద పూలకుండీలు, మల్లెతీగలు... ఎంతో బావుంటుంది. వెన్నెల రాత్రి అలా మేడమీద పడుకుని మల్లెల వాసన ఆఘ్రాణిస్తూ ఆకాశంకేసి చూస్తుంటే అంతే ఇక! 'ఎటో వెళ్లిపోయింది మనసు...' అని పాడుకోవాల్సిందే!

ఆ ఇంట్లోకి దిగిన మొదటి రోజునే ఆమెను చూశాను. పేరు 'చరిష్మా'అనీ, పక్కింట్లో వుంటున్నారనీ తెలుసుకున్నాను. నిజానికి నిజంగా ఆ రోజు ఆ మెరుపుతీగెను, అందాల భరిణెను, స్వీట్ సిక్స్‌టీన్ దాటిన ఆ స్వీటీని చూడగానే నా హృదయంలో భూకంపమే పుట్టుకొచ్చింది. అంతే! అలా కన్నార్పకుండా ఆమె వైపు చూడటం ఆమె కళ్లార్పుతూనే గమనించింది. అలా లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లో ఆ నాటి నైట్ నిద్ర లేకుండానే ఆమె ఆకారాన్ని, ఆమె అందాల్ని, అంతకు మించిన హొయల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ జాగరణే చేశాను.

అలా మొదలైన మా ప్రేమ తర్వాతి రోజునుంచి మరో రోజుకు మరో అడుగు చొప్పున ముందేసుకుంటూ ఆమెను చూడకుండా నేను, నన్ను చూడకుండా ఆమె వుండలేని స్థితికి చేరుకుని ఎంతో దగ్గరైపోయాం.

అటువంటి పరిస్థితుల్లో వున్నట్లుండి ఓ రోజు చరిష్మా వాళ్ల నాన్నమ్మకు సీరియస్‌గా వుందంటే ఆమె అమ్మా, నాన్నా, తమ్ముడూ హడావిడిగా బయలుదేరి వూరెళ్లారు. ఏవో అసైన్‌మెంట్స్ వున్నాయంటూ ఇంట్లో ఒక్కతే మిగిలిపోయింది చరిష్మా.

సాయంత్రం మేడమీదికొచ్చి పూలు కోస్తూ ఓ మల్లెమొగ్గను ప్రేమబాణంలా విసిరింది. దగ్గరికెళ్లాను.

"మా పేరెంట్స్ వూరెళ్లారు. ఇంట్లో రాత్రికి నేనొక్కదాన్నే!'' అంది.

"అలాగా!'' అన్నాను.

"ఈ రోజు రాత్రికి మెస్‌కు వెళ్లకండి. భోజనం మా ఇంట్లోనే చేద్దురుగాని!'' అంది.

అంతే! నా ఆనందానికి హద్దులేదు!

రాత్రి టీ.వీ.లో ఇంగ్లీషు న్యూస్ వచ్చే సమయానికి వెళ్లాను. ఇద్దరం కలిసి భోజనం చేశాం. ఇల్లంతా చూపించింది. చాలా పెద్ద ఇల్లు.

డ్రాయింగ్ రూమ్‌లో టీ.వీ. ముందు కూర్చున్నాం. సోఫామీద జస్ట్ ఓ అడుగు దూరంలో కూర్చున్న చరిష్మా తలలోని విరజాజులు గుప్పుమంటూ సువాసనలు విరజిమ్ముతున్నాయి. చరిష్మా రోజ్‌కలర్ నైటీలో చాలా ఎగ్జయిటింగ్‌గా వుంది చూట్టానికి! అందుకే నేను అలాగే చూస్తూండిపోయాను ఆమెవైపు.

"ఏంటీ అలా చూస్తున్నావ్?'' అడిగింది చరిష్మా. ఏం సమాధానం చెప్పాలి? "నా హృదయానికి ఎదురుగా ప్రియురాలి రూపం వుంటే చూడకుండా ఎలా వుండను?'' అని మనసులో అనుకుని అదే బయటకనేశాను. ఆ మాటలకు ఆమె బుగ్గలు సిగ్గుతో ఎర్రమందారాలే అయ్యాయి.

గోడ గడియారం వైపు చూశాను. అప్పటికే ఊరంతా గాఢనిద్ర పరిష్వంగంలో మునిగిపోయింది. చాందినీ రాత్ కా చాంద్... కిటికీలోంచి కనిపిస్తున్నాడు. ఆమెకు చూపించాను.

"బావుంది కదూ?'' అంది. వెంటనే అందుకుని "నీలాగే" అని జత చేశాను. ఆ మాటకు ఆమె ఆమెంత అందంగా నవ్వింది. "టీ.వీ. ఆఫ్ చేయనా?'' అడిగింది.

"ఏం? నిద్రొస్తూందా?'' అడిగాను. ఓ వేళ నిద్రొస్తూందంటే నేను బయటకు నడవక తప్పదు కదా!


"ఊఁహూ! రావటం లేదు'' అంది.

"అన్నట్లు ఇంట్లో ఒక్కదానివే వున్నావు. రాత్రికి తోడుగా ఇక్కడే వుంటాన్లే'' అన్నాను.

నేనలా అనేసరికి ఆమె ముఖంలో ఆనందం కొట్టొచ్చినట్లు కనిపించింది. "అయితే బెడ్ రూమ్‌లో బెడ్ షీట్స్ మార్చొస్తాను'' అని వెళ్లబోతుంటే ఎందుకో నాలో తెలీని ఓ భయం లాంటిది చోటు చేసుకుంది. నాకు తెలీకుండానే నేను తొందర పడొచ్చు. అప్పుడికేమైనా వుందా? అమ్మో! అసలే చరిష్మా నన్నెంత నమ్మివుంటే, నామీద ఎంత మంచి అభిప్రాయం వుండుంటే ఇలా నన్ను ఆహ్వానిస్తుంది!

అందుకే చెప్పేశాను-"పర్వాలేదు. నేనిక్కడ సోఫాలో పడుకుంటాను. నీవు లోపలపడుకో!'' అని.

ఏమో! ఆ మాటలకు ఆమె నొచ్చుకుందో లేదో తెలీదుకానీ, ఆమెలో అదో వింత



ఫీలింగ్ గమనించాను. తెల్లారగానే లేచి నా గదిలోకి నేను వెళ్లిపోయాను.

నిన్న రాత్రి జరిగిందదీ. అదే మా ఫ్రెండ్స్‌తో చెప్పాను. అంతా విన్నాక మావాళ్లు చాలా తేలిగ్గా కొట్టిపడేశారు. "మేం నమ్మం!" అన్నారు.

"అందుబాటులో వున్న ఓ అందమైన పడుచు అమ్మాయితో ఏకాంతరాత్రిని అందమైన రాత్రిగా మలుచుకోవడం తెలీని అమాయకుడివేం కాదులే నీవు!" అనికూడా అన్నారు.

అప్పుడు నాకు కించిత్తు కోపం రాక మానలేదు. "ఇంతకీ మీరు మా ప్రేమ గురించి ఏమనుకుంటున్నారు? మాది అశరీరప్రణయం! మేం మనసులతో ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నామే కానీ శరీరాలతో కాదు! అంతా పెళ్లయిన తర్వాతే!" అన్నాను ఆవేశంగా.

"చూడబ్బాయ్! ప్రేమంటే మీనింగ్ మారిపోయి శాన్నాళ్లయింది. యూజ్ అండ్ త్రో! అంతే కానీ పెళ్లీ గిళ్లీ అంటూ కలలు కనకు! ఇంతకీ ఆ అమ్మాయిది ఏ టైపు ప్రేమో తెలుసుకో ముందు! అయినా ఊరుకాని ఊరు, రాష్ట్రం కాని రాష్ట్రంవాడివి నిన్ను ఆ అమ్మాయి పెళ్లి చేసుకోవటానికి అంగీకరిస్తుందా? ఆమె అంగీకరించినా ఆమె తల్లిదండ్రులు ఒప్పుకోవాలి కదా! ఏమో మా లెక్కప్రకారం నీ చరిష్మాది కూడా 'యూజ్ అండ్ త్రో' ప్రేమేనని మా నమ్మకం!" అంటూ క్లాసు తీసుకున్నారు.

ఆ రోజు సాయంత్రం పూలు కోయడానికి మేడమీదకొచ్చింది చరిష్మా. దగ్గరగా వెళ్లాను. "చరీ! నీకో విషయం తెలుసా! రాత్రి నీతో గడిపిన మధురక్షణాలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. అదే మా స్నేహితులకి చెప్పాను. కానీ వాళ్లు నమ్మడంలేదు, తెలుసా! మనది స్వచ్ఛమైన ప్రేమనీ, కనీసం నీ చేతినైనా తాకలేదనీ చెప్తే వాళ్లేమన్నారో తెలుసా? నువ్వు స్వచ్ఛమైన ప్రేమతో ఉండి ఉండొచ్చు కానీ ఆ అమ్మాయికి కోరిక ఉండవచ్చు కదా! ఎర్రగా బుర్రగా ఉన్న నీతో ఆ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంటుందో మొదటిసారిగా చవిచూడాలనే కోరికతోనే నిన్ను పిలిచి ఉండొచ్చు కదా అన్నారు వాళ్లు. అదీగాక ఈ కాలపు ప్రేమంటే 'యూజ్ అండ్ త్రో' టైపులోనే ఉండాలని కూడా అన్నారు!" అంటూ చెప్పుకుపోయాను.

నా మాటలు ఆసాంతం విన్న ఆమె కిందకి వెళ్తూవెళ్తూ అందికదా - **"మరి అనరా ఏంటి?"** ■